క్లుప్తంగా

42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

శాయంపేట : కేంద్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగరి సాంబయ్య శుక్రవారం డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం అని గొప్పగా నాయకులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా 6శాతం ఉన్న అగ్రకులాలకు ఎలాంటి కమిషన్ లేకుండా 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీలకు అవకాశం దక్కకుండా అడ్డుకోవడం అన్యాయం అన్నా రు. భారతదేశంలో బీసీలందరూ ఏతా టిపై రావాలని బీసీలను మోసం చేస్తున్న పార్టీలను భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా 42 శాతం రిజర్వేషన్ పెంపునకు 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ చేస్తూ తక్షణమే పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి


అంజి (ఫైల్)

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఉప్పల్‌కు చెందిన గుడెల్లి అంజి (33) స్థానిక ఎల్లమ్మ గుడి నుంచి తన బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎల్లమ్మ గుడి సర్కిల్ వద్దకు రాగానే సిమెంట్ బస్తాలతో దేశరాజుపల్లి వైపు వెళ్తున్న ట్రాక్టర్ అంజి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంజికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 ద్వారా వరంగల్‌లోని ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి తండ్రి సదయ్య ఫిర్యాదుతో ట్రాక్టర్ డ్రైవర్ గుండెబోయిన రాజేశంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, కుమార్తెలు ఉన్నారు.

చెట్టుకొమ్మ విరిగిపడి వృద్ధుడికి తీవ్ర గాయాలు

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన బట్టు ఆగయ్య అనే వృద్ధుడిపై చెట్టుకొమ్మ విరిగిపడగా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ భూ తగాదా విషయంలో గ్రామంలోని ఇరు వర్గాల నడుమ కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం భూమిలోని ముళ్ల చెట్లను ఓ వర్గానికి చెందిన వ్యక్తులు తొలగిస్తుండగా ఆగయ్యపై ప్రమాదవశాత్తు చెట్టు కొమ్మ విరిగిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన చుట్టుపక్కల వారు 108కి సమాచారం అందించి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

కేజీబీవీ నుంచి పారిపోయిన బాలిక?

● బంధువుల ఇంట్లో ఆచూకీ లభ్యం

ఐనవోలు : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 8వ తరగతి చదువుకుంటున్న విద్యార్థిని శుక్రవారం మధ్యాహ్నం విద్యాలయం నుంచి పారిపోయినట్లు తెలిసింది. న్యూశాయంపేటకు చెందిన సదరు విద్యార్థిని దసరా సెలవులకు ఇంటికి వెళ్లింది. పాఠశాలకు వచ్చేందుకు మారం చేస్తుండటంతో తల్లిదండ్రులు మందలించి గురువారం తల్లిదండ్రులు వచ్చి పాఠశాలలో చేర్పించి వెళ్లారు. అయితే శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రమంలో క్రీడా పోటీల కోసం అందరు విద్యార్థినులతో కలిసి సదరు విద్యార్థిని కేజీబీవీ నుంచి బయటకు వెళ్లింది. మధ్యాహ్నం నుంచి ఆ విద్యార్థిని కనిపించకపోవడంతో కేజీబీవీ ఎస్‌ఓ బాలిక తల్లిదండ్రులతో పాటు పోలీసులకు ప్రాథమికంగా సమాచారం అందించారు. పోలీసులు సీసీ కెమెరా పుటేజీలను జల్లెడ పట్టడంతో పాటు ఆమె తల్లిదండ్రులు బంధువుల ఇళ్లకు ఫోన్లు చేశారు. ఈ క్రమంలో ఖిలా వరంగల్ మండలం జక్కలొద్దిలో బంధువుల ఇంటికి చేరుకున్నట్లు సమాచారం అందడంతో అధికారులు, విద్యార్థిని తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థినికి కేజీబీవీలో చదవడం ఇష్టం లేకపోవడంతో పారిపోయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కేజీబీవీ నుంచి ఓ బాలిక బయటకు వెళ్లినా టీచర్లు గుర్తించకపోవడం పర్యవేక్షణ లోపం ఉందని పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అయితే కేజీబీవీ, జెడ్పీహెచ్‌ఎస్, యూపీపీఎస్‌లకు కామన్ కాంపౌండ్ ఉంది. కేజీబీవీకి ప్రత్యేక కాంపౌండ్ నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అవగాహన

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నోబెల్ బహుమతులు– 2025పై అవగాహన సదస్సు నిర్వహించారు. పర్యావరణ విభాగం రాష్ట్ర కన్వీనర్ ధర్మ ప్రకాశ్ హాజరై సమాజ శ్రేయస్సు, మానవత కృషి, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, సమాజ అభివృద్ధిలో విద్య తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

బోగస్ మస్టర్లకు చెక్

● ఈజీఎస్ పనుల్లో పారదర్శకతకు ఈ–కేవైసీ విధానం
● ఆధార్‌తో అనుసంధానం
● ఈ–కేవైసీ నమోదులో జిల్లాలో దామెర మొదటిస్థానం


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)


తక్కళ్లపహాడ్‌లో ఐరిస్ నమోదు చేస్తున్న సిబ్బంది

దామెర : గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఉపాధి కల్పించేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 2006 లో కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అప్పటి నుంచి గ్రామీణ ప్రాంత నిరుపేద కుటుంబాలను గుర్తించి అర్హత కలిగిన వారికి ఉపాధి హామీ కార్డులు జారీ చేసి సంవత్సరంలో కనీసం వంద రోజుల పని కల్పిస్తుంది. ఇందుకోసం మండలస్థాయిలో పీఓ, ఏపీఓ, గ్రామస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించి పనులను పర్యవేక్షిస్తున్నారు. కాగా కొన్నిచోట్ల ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు గుర్తించారు. ఒకరి పేరుపై జాబ్‌కార్డు ఉంటే మరొకరు పనులకు వెళ్లి కూలి పొందుతున్నట్లు గుర్తించారు. అదే విధంగా చనిపోయిన వారిపేర్లు నమోదు చేసి బోగస్ మస్టర్లు వేసి అందినకాడికి దండుకోవడం వంటి సంఘటనలను క్షేత్రస్థాయిలో గుర్తించారు.

అక్రమాలకు చెక్..

ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి, పనుల్లో పారదర్శకత ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం ఈ–కేవైసీ విధానాన్ని ప్రవేశపెట్టింది. దీంతో సంబంధిత అధికారులు హనుమకొండ జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని నమోదును ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. అక్రమాలను అడ్డుకట్ట వేసేందుకు నూతన సాఫ్ట్‌వేర్‌ను జాతీయ మస్టర్ పర్యవేక్షణ వ్యవస్థ (ఎన్ఎంఎంఎస్) యాప్ అందుబాటులోకి తీసుకొచ్చారు. అందులో భాగంగా ఉపాధి కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసి (కేవైసీ) చేస్తున్నారు. కూలీల కనుపాప(ఐరిస్) నమోదు చేస్తున్నారు. ఈ–కేవైసీ చేసుకోని వారి కార్డులు రద్దు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

కేవైసీ నమోదులో దామెర ఫస్ట్

ఉపాధి హామీ కూలీల ఈ–కేవైసీ నమోదు చేయడంలో దామెర ప్రథమస్థానంలో నిలిచింది. మండలంలోని 5,631 మంది కూలీలకు గాను 5,501 మందికి ఈ–కేవైసీ పూర్తిచేశారు. కాగా 97.69 శాతం ఈ–కేవైసీ పూర్తిచేసి జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచింది. అదే విధంగా రాష్ట్రస్థాయిలో హనుమకొండ జిల్లా మొదటి స్థానంలో ఉన్నట్లు సమాచారం.

జల్సాలకు అలవాటుపడి చోరీలు

● ఇద్దరి అరెస్ట్, పరారీలో మరొకరు
● వివరాలు వెల్లడించిన ఏసీపీ సతీశ్‌బాబు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సతీశ్‌బాబు, పక్కన సీఐ సంతోశ్

ఆత్మకూరు : జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న ఓ యువకుడిని, ఇంటర్ చదువుతున్న బాలుడిని ఆత్మకూరు పోలీస్‌లు అరెస్ట్ చేశారు. ఏసీపీ సతీశ్‌బాబు శుక్రవారం వివరాలు వెల్లడించారు. కటాక్షపూర్ చెక్‌పోస్ట్ వద్ద అనుమానాస్పదంగా బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు, ఓ బాలుడిని పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. హనుమకొండ గోపాల్‌పూర్‌కు చెందిన పాశం ప్రణీత్, సాయితోపాటు ఇంటర్ చదువుతున్న మరో బాలుడు జల్సాలకు అలవాటుపడి మండలంలోని గుడెప్పాడ్‌లో గల రామాలయంలో జూన్ మాసంలో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఆలయంలో రూ.వేయి నగదు, వెండి యజ్ఞోపవీతం, రెండు బంగారు పుస్తెలు ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. అలాగే దుగ్గొండి మండలం గిర్నిబావి వైన్‌షాపులో చోరీకి పాల్పడి రూ.12వేల నగదుతో పాటు మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లారని వెల్లడించారు. దీంతో పాశం ప్రణీత్, ఇంటర్ చదువుతున్న బాలుడిని అరెస్టు చేసి వారి నుంచి బంగారం, నగదు రికవరీ చేసి బైక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. సాయి అనే యువకుడు పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు. కాగా కేసును ఛేదించిన పోలీసులను ఏసీపీ అభినందించారు. సీఐ సంతోశ్, ఎస్సైలు తిరుపతి, సతీశ్, సిబ్బంది కుమారస్వామి, శ్రీనివాస్ ఉన్నారు.

పెద్దమ్మతల్లి గుడి నిర్మాణానికి సహకరిస్తా

● ఎంపీ ఈటల రాజేందర్


ఎంపీ ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న గుడి నిర్మాణ కమిటీ సభ్యులు

దామెర : మండలంలోని ల్యాదెళ్లలో గల పెద్దమ్మతల్లి గుడి నిర్మాణానికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేదర్ అన్నారు. పెద్దమ్మతల్లి గుడి నిర్మాణ కమిటీ సభ్యులు శుక్రవారం ఎంపీని మర్యాదపూర్వంగా కలిసి శాలువాతో సత్కరించి, గుడి నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గుడినిర్మాణంలో భాగంగా కావలసిన 900 ఫీట్ల గ్రానైట్‌ను విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. సుమారు 55వేల రూపాలు విలువచేసే గ్రానైట్ ఇవ్వడంపై కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పిట్టల రమేశ్, ఇండ్ల రాజు, పెండెం రజినికర్, రాజు, మధు, ప్రకాశ్, బుచ్చన్న, వినయ్, కుమార్, రాజ్‌కుమార్, శ్రీను, నాగరాజు తదితరులు ఉన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ బీసీల ద్రోహులు

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి


మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

శాయంపేట : బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు బీసీల ద్రోహులుగా మిగిలిపోయారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పుల, జోగంపల్లి, పెద్దకోడెపాక, గోవిందాపూర్, హుస్సేన్‌పల్లి, పత్తిపాక గ్రామాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ శాస్త్రీయంగా కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని శాసనసభలో బిల్లు ఆమోదించి గవర్నర్, రాష్ట్రపతికి పంపిస్తే బీజేపీ అడ్డుకుందని ఆరోపించారు. 2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 50 శాతం మించకుండా కుందించిందని అన్నారు. అనంతరం బీజేపీ ఓటుచోరీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సామల మధుసూదన్, రవి, రవీందర్, కుమారస్వామి, రాజిరెడ్డి, రమేశ్, హైదర్, వెంకట్, రాజిరెడ్డి, శంకర్, సదానందం, కుమారస్వామి, పైడి, భద్రయ్య, నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు మానసిక దృఢత్వం అవసరం

● ప్రిన్సిపాల్ సంతోశ్‌కుమార్



మాట్లాడుతున్న సంతోశ్‌కుమార్

పరకాల : విద్యార్థులు శారీరకంగానే కాకుండా మానసికంగా చాలా దృఢంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోశ్‌కుమార్ అన్నారు. పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోశ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాల వినియోగం అధికమైందని, విద్యార్థులు మంచి విషయాలకు మాత్రమే వాటిని ఉపయోగించుకోవాలని కోరారు. ఆరోగ్యంపై ప్రభావితం చూపే విషయాలను దూరంగా ఉంచడం విద్యార్థి దశ నుంచే అవసరమన్నారు. సెల్‌ఫోన్ వినియోగం తగ్గించిన వరంగల్ విద్యార్థిని శివానీని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.మల్లయ్య, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ అశోక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజలకు బాకీ సొమ్ము వెంటనే చెల్లించాలి


దామెర : బాకీకార్డు అందించి ప్రజలకు వివరిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు


ఆత్మకూరు : కార్డులను పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దామెర : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు బాకీ పడిన సొమ్ము వెంటనే చెల్లించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గండు రాము డిమాండ్ చేశారు. పులుకుర్తిలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన కాంగ్రెస్ బాకీ కార్డును ప్రజలకు వివరిస్తూ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల్లో భాగంగా అమలు చేస్తానన్న పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. అందులో భాగంగా మహిళలకు నెలకు రూ.2500 చొప్పున 55వేలు, వృద్ధులకు రూ.44వేలు, రైతు భరోసా రూ.76వేలు, నిరుద్యోగులకు రూ.88 వేలు, వికలాంగులకు రూ.44 వేలు, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు రాష్ట్ర ప్రభుత్వం బాకీ ఉందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ.జాకీర్‌అలీ, రాజు, శంకర్, కృష్ణమూర్తి, గోపాల్, సుమలత, రాజు, సంపత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు మండలంలోని అక్కంపేట, పెద్దాపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ.. మాయ మాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతారని అన్నారు. కుమారస్వామి, రవియాదవ్, రవీందర్, సుధాకర్‌రెడ్డి, అంకూస్, భగవాన్‌రెడ్డి, సుధాకర్, సాగర్, కుమార్ పాల్గొన్నారు.

పలు సంఘాలకు కార్యవర్గాల ఎన్నిక


కమలాపూర్ : నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయీబ్రాహ్మణులు

కమలాపూర్ : నాయీబ్రాహ్మణ సంఘం కమలాపూర్ పట్టణ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొగిలిచెర్ల మొగిలి, ఉపాధ్యక్షుడిగా మొగిలిచెర్ల రాజు, కార్యదర్శిగా మొగిలిచెర్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా మొగిలిచెర్ల మధు, కోశాధికారిగా మొగిలిచెర్ల శ్రీనివాస్, సహాయ కోశాధికారిగా ముత్యాల సతీశ్, డైరెక్టర్లుగా మొగిలిచెర్ల రాజేందర్, మొగిలిచెర్ల కన్నయ్య, మొగిలిచెర్ల అశోక్, మొగిలిచెర్ల కుమారస్వామి ఎన్నికయ్యారు. సంఘం సభ్యులు నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

మండల కమిటీ ఎన్నిక


నియామకపత్రం ఇస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు

శాయంపేట : జాతీయ మానవ హక్కుల సంఘం మండల కమిటీని ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు ఏదుల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి రేణికుంట్ల పృథ్వీరాజ్ శుక్రవారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా మారబోయిన అనిల్, సంయుక్త కార్యదర్శిగా పైండ్ల రజనీకాంత్, ప్రచార కార్యదర్శిగా కన్నెపు వంశీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నియామకపత్రాలు అందజేశారు.

పద్మశాలి యువసేన అధ్యక్షుడిగా దేవరాజ్


దేవరాజ్, అధ్యక్షుడు

మండల కేంద్రంలోని చేనేత పద్మశాలి భవనంలో శుక్రవారం పద్మశాలి యువసేన 18వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి యువసేన నూతన అధ్యక్షుడిగా వనం దేవరాజ్‌ను, ఉపాధ్యక్షుడిగా బాసాని బాలకృష్ణను సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేలేరు : మండలంలోని పీచర, మల్లికుదుర్ల సబ్‌స్టేషన్లల్లో అత్యవసర మరమ్మతులు చేపట్టనున్న కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కుమారస్వామి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దామెరలో..

దామెర : మండలంలోని ఊరుగొండ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ గుర్రం రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని ఊరుగొండ, పసరగొండ, పులుకుర్తి, దుర్గంపేట్, సీతారాంపూర్ గ్రామాల గృహ, వాణిజ్య, వ్యవసాయ, పారిశ్రామిక, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సాయిశ్రుతి



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మోరే సాయిశ్రుతి ఇటీవల హనుమకొండలోని జేఎన్‌ఎస్ స్టేడియంలో జరిగిన అండర్–19 ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు గేమ్స్ సెక్రటరీ శ్రీధర్ తెలిపారు. సాయిశ్రుతి ప్రస్తుతం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. నిరుపేద కుటుంబానికి చెందిన సాయిశ్రుతి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక అవడంతో గ్రామస్తులు అభినందించారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో మాక్ పోలింగ్


మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని గట్లనర్సింగాపూర్ గ్రామంలో గల జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికల నిర్వహణ పద్ధతిని వివరించారు. అనంతరం ఎఈఓ సునీతారాణి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు విలువైందన్నారు. ఎన్నికల ప్రక్రియ, ప్రాధాన్యాన్ని వివరించారు. భవిష్యత్‌లో ఓటర్లుగా మారే విద్యార్థులకు ఎన్నికల నిర్వహణ, ఓటుహక్కు వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, రమేశ్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, నవీన్, అశోక్, శ్రీనివాస్, స్వర్ణలత, నాగరాజు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో రోడ్డు మరమ్మతులు


రోడ్డు మరమ్మతులు చేయిస్తున్న ప్రదీప్‌రెడ్డి

కమలాపూర్ : మండలంలోని శనిగరం నుంచి హనుమకొండ మార్గంలో గుంతలమయమైన రోడ్డుకు శనిగరానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పింగిలి ప్రదీప్‌రెడ్డి శుక్రవారం సొంత ఖర్చుతో మరమ్మతులు చేయించారు. శనిగరం నుంచి ఎర్రగట్టుగుట్ట వరకు గుంతలను పూడ్చడానికి రూ.1.10 లక్షలు ఖర్చు అవుతుండగా, శుక్రవారం అంబాల వరకు ఉన్న గుంతలు పూడ్చివేయించానని, మిగతా గుంతలను శనివారం పూడ్చి వేయించనున్నట్లు ప్రదీప్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రెడ్డికి వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

హనుమకొండ రూరల్ డీఈ సామ్యనాయక్

దామెర : వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్లు హనుమకొండ రూరల్ డివిజనల్ ఇంజనీర్ సామ్యనాయక్ తెలిపారు. మండల కేంద్రంలో విద్యుత్ శాఖ నూతన కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వినియోగదారుల సౌకర్యార్థం సబ్‌స్టేషన్ ఆవరణలో నూతన కార్యాలయం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వినియోగదారులకు సమస్యలు ఏర్పడితే వెంటనే అధికారులను సంప్రదించాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఏడీఈ దేవేందర్, ఏఈ రమేశ్, సబ్ ఇంజనీర్ చందన, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, జేఎల్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పారదర్శకంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్ : జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీని పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఈజీఎస్ సామాజిక తనిఖీ బృందం, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా 01-04-2024 నుంచి 31-03-2025 వరకు ఉపాధి హామీ పనుల ద్వారా రూ.8.08 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఆ పనులకు సంబంధించి తనిఖీకి రానున్న సామాజిక తనిఖీ బృందాలకు ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని అన్నారు. ఉపాధి హామీ పనుల్లో జరిగిన లోపాలను, సమాజానికి ఉపయోగపడిన విషయాలను తనిఖీ బృందాలు పరిగణలోకి తీసుకుని నివేదికలు పొందుపర్చాలని సామాజిక తనిఖీ బృందాన్ని కోరారు. అనంతరం సామాజిక తనిఖీ బృందం ఎస్సార్పీ రంజిత్ మాట్లాడుతూ.. తనిఖీ బృందాలు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి తనిఖీని పాదర్శకంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఓ రమేశ్, ఈసీ కార్తీక్, డీఆర్పీలు కల్యాణ్, శంకర్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్పీలు, ఉపాధి హామీ సిబ్బంది, మేట్లు పాల్గొన్నారు.

నల్లిపురుగులను నివారించాలి


రైతులకు సూచనలిస్తున్న ఏఈఓ రామకృష్ణ

దామెర : వరిలో ఏర్పడిన నల్లిపురుగుల నివారణకు రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈఓ రామకృష్ణ సూచించారు. మండలంలోని పులుకుర్తిలో శుక్రవారం రైతులతో కలిసి వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పొట్ట దశలో ఉన్నప్పుడు వరికంకినల్లి పురుగుల కోసం యాజమాన్యపద్ధతులు పాటించాలన్నారు. ప్రస్తుతం ఆకునల్లి, కంకినల్లి(నల్లకంకి), వరి కంపనల్లి పలు చేన్లకు ఆశించినట్లు గుర్తించామన్నారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిచికారీ చేయాల్సిన పురుగు మందుల వివరాలను రైతులకు తెలిపారు. రైతులు మహేశ్, రమేశ్, మదన్‌మోహన్, రాజేందర్, లింగమూర్తి, లక్ష్మణ్, రాంబాబు, సతీశ్ ఉన్నారు.

నేడు ఉచిత కంటి పరీక్షలు

ఆత్మకూరు : మండల కేంద్రంలో శనివారం గణేశ్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆపరేషన్లు అవసరమున్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నామని పేర్కొన్నారు.

గుడుంబా పట్టివేత



ఆత్మకూరు : అక్రమంగా తరలిస్తున్న గుడుంబాను పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోశ్ తెలిపారు. మండల కేంద్రంలోని పోచమ్మ సెంటర్ వద్ద శుక్రవారం పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో నల్లబెల్లి మండలం నందిగామకు చెందిన భక్యా కల్యాణి, దాసు దంపతులు రూ.10వేల విలువ చేసే 50లీటర్ల గుడుంబాను బైక్‌పై తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను కోర్టుకు హాజరు పరిచి బైక్‌ను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.